ప్రజాశక్తి

శనివారం 14 డిసెంబర్ 2024

5

పార్వతీపురం మన్యం

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో శనివారం ఉదయం 10గంటల నుంచి రెండో అదనపు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.దామోదరరావు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారాల కేసులు, సెక్షన్138 నెగోషిబుల్ ఇనుస్ట్రుమెంట్ కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు, పారిశ్రామిక వివాదాలు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించనున్నట్లు చెప్పారు. కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు..



పెరిగిన బిల్లులతో ఉపాధి భారం

ప్రభుత్వం నిరుద్యోగ యువతను ఆదుకోకపోయినా స్వయం ఉపాధితో నెట్ సెంటర్, జెరాక్స్ కాపీయింగ్ ఉపాధిగా మలుచుకున్న మాలాంటి నిరుద్యోగులకు పెరిగిన కరెంట్ బిల్లులు పెనుభారంగా మారుతున్నాయి. గత నెల వరకు రూ.600 వచ్చిన కరెంటు బిల్లులు ఈనెల అమాంతంగా రూ.1100కు పెరగడంతో, సంపాదనలో సగం కరెంటుకే పోతే షాపు అద్దె, బ్యాంకు లోన్లు కట్టడం కష్టంగా మారి వ్యాపారాలు దివాళా తీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం స్పందించి స్వయం ఉపాధిదారులకు విద్యుత్ రాయితీలు అందించాలి.

కె.నవీన్ నారాయణ,
నెట్ సెంటర్ నిర్వాహకుడు, పార్వతీపురం

అదనపు ఛార్జీలే అధికం

సర్దుబాటు భారంతో విలవిల
యూనిట్లు తక్కువ.. బిల్లు ఎక్కువ
బెంబేలెత్తుతున్న వినియోగదారులు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వ నాయకులు అధికారం చేపట్టిన ఆరు నెలల్లోపే ఫ్యూయల్ అండ్ పవర్ కాస్ట్ అడ్జస్ట్మెంట్ (ఎఫ్‌పిపిసిఎ), ట్రూ అప్ ఛార్జీల పేరిట వినియోగదారులపై భారాలు వేశారు. డిసెంబర్ నుంచి పెంచిన విద్యుత్ ఛార్జీల ధాటికి, సామాన్యులు, గృహ వినియోగదారులతో పాటు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులు విలవిలలాడిపోతున్నారు. కార్పెంటర్, వెల్డింగ్, నెట్ సెంటర్, పండ్ల రసాల షాపులతో విద్యుత్తుతో సంబంధం ఉన్న ఇతర వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులు ఈనెల బిల్లు చూసి లబోదిబోమంటున్నారు. కార్పెంటర్‌గా పనిచేస్తూ కలపపై డిజైన్లు చెక్కుకొని జీవనం కొనసాగిస్తున్న జె.సత్యనారాయణ అనే వినియోగదారుడు గత నెల వినియోగించిన 42 యూనిట్ల గానూ కరెంటు ఛార్జి రూ.221 అయితే ఇతర ఛార్జీలతో కలిపి ఈనెల బిల్లు రూ.709 రావడంతో ఒక్కసారి షాక్ తిన్నాడు. అలాగే పార్వతీపురంలో ఇతర వృత్తి, వ్యాపారుదారులు కూడా అకస్మాత్తుగా పెరిగిన విద్యుత్ ఛార్జీలకుచార్జీలకు బెంబేలెత్తుతున్నారు.

జిల్లాలో గృహ అవసర వినియోగదారులతో పాటు వాణిజ్య, ఇతర కేటగిరీయాలకు చెందిన 2,65,876 సర్వీసు కనెక్షన్లు ఉన్నాయి. అయితే జిల్లా విభజన తర్వాత పాలకొండ డివిజన్‌కు సంబంధించి వీరఘట్టం, పాలకొండ, భామిని, సీతంపేట మండలాలకు చెందిన కనెక్షన్లు శ్రీకాకుళం జిల్లా లోనే కొనసాగుతున్నాయి. వీటిని కూడా లెక్క వేసుకుంటే 3 లక్షలకు పైగా వినియోగదారులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఈనెలలో ఎఫ్‌పిపిపిసిఎ ఛార్జీలు రూపంలో రూ.120 కోట్లు అదనపు భారం వినియోగ దారులపై పడింది. అంతే కాకుండా వచ్చే నెలలో మరో రూ. 9వేల కోట్లు ట్రూ అప్ ఛార్జీల భారాన్ని కూడా వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం వేసేందుకు రంగం సిద్ధం చేసింది. పెరుగుతున్న విద్యుత్ బిల్లులతో పాటు మరో వైపు విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు గ్రామాల్లో పర్యటించి అదనపు విద్యుత్ లోడ్లు పేరిట అపరాధ రుసుం భారీగా విధించడంతో ప్రభుత్వం తీరుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుంది. మరోవైపు వైసిపి ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో ట్రూఅప్, ఎపిపిపిపిసిఎ వంటి రూపాల్లో విధించిన బిల్లుల భారం ఇప్పటికీ కొనసాగుతోంది.

అసలు ఛార్జీల కంటే అదనపు ఛార్జీలే అధిక భారం

కరెంటు ఆధారంగా చిన్న చిన్న కలప పనులు చేసుకుంటున్న మాకు పెంచిన విద్యుత్ చార్జీలు అధిక భారంగా మారాయి. గత నెలలో అన్ సీజన్ కారణంగా తాము ఉపయోగించిన 41 యూనిట్లకు గాను కరెంటు ఛార్జి రూ.221 కాగా, అదనపు ఛార్జీలతో కలిపి బిల్లు ఈనెల రూ.709 వచ్చింది. ఇక సీజన్లో ఎక్కువగా విద్యుత్తు వినియోగిస్తే వచ్చే బిల్లు తలుచుకుంటే భయమేస్తుంది. ఇలా విచ్చలవిడిగా విద్యుత్ ఛార్జీలు ప్రభుత్వం పెంచితే, సామాన్యుడు మనుగడ సాగించడం కష్టం.

జామి సత్యనారాయణ, కార్పెంటర్,
పార్వతీపురం .

నేడే సాగునీటి సంఘాల ఎన్నికలు

- ప్రశాంతంగా నిర్వహించాలి : కలెక్టర్
- 9ఏళ్ల తర్వాత నిర్వహణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని 213 సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 22 భారీ నీటిపారుదల, 25 మధ్యతరహా, 166 చిన్నతరహా నీటి వనరులు వెరసి 213 నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ సంబంధిత అధికారులతో శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో లక్షా 16వేలమంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సర్వం సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేలా అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి ఆయా సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. ముందుగా అభ్యర్థుల ఏకగ్రీవాన్ని పరిశీలించి, ఏకగ్రీవం లేకుంటే అభ్యర్థుల వరుస క్రమం ప్రకారం వేదికపైకి అభ్యర్థిని పిలిచి చేతులు పైకెత్తే విధానంలో ఎన్నిక జరిపించాలని అన్నారు. ఎవరికి ఎక్కువ మద్దతు లభిస్తే వారిని విజేతలుగా ప్రకటించాలని కలెక్టర్ తేల్చి చెప్పారు. పట్టాదారు పాస్‌బుక్, ఓటరు కార్డు, ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డుతోనైనా రైతులకు ఓటు వేసే అవకాశం కల్పించాలని కలెక్టర్ వివరించారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ కొరకు ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈనెల 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనున్నట్లు కలెక్టర్ వివరించారు.

9ఏళ్ల తరువాత నిర్వహణ

సాగునీటి సంఘాలకు సుమారు 9ఏళ్ల తరువాత ఎన్నికలు జరుగుతున్నాయి. ఆయకట్టు పరిరక్షణ, సాగు, నీటి సరఫరా సజావుగా జరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు పూర్తి అవగాహన ఉంటుంది. వారే సభ్యులుగా ఉన్న కమిటీలు అందుబాటులోకి వస్తే మేలు జరుగుతుందని భావిస్తున్నారు. వివాదాల పరిష్కారానికి ఆస్కారం ఏర్పడుతుంది.

అవుట్ సోర్సింగ్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద రిలే దీక్షల శిబిరంలో ఆయన మాట్లాడుతూ నెలరోజులుగా సమ్మెలో ఉన్న గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండు ఆమోదించాలని కోరారు. వారి ఉద్యోగాలు డిఎస్సీ నుంచి మినహాయించాలని కోరారు. వీరి దీక్షలకు పలు గిరిజన సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాటం చేస్తామని వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్, గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్లా సురేష్, ట్రైబల్ రైట్ ఫోరం ఇంటికుప్పల రామకృష్ణ, గిరిజన అభ్యుదయ సంఘం ఆరిక చంద్రశేఖర్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రెడ్డి వేణు

కాంగ్రెస్ సంఘీభావం

సాలూరు: గిరిజన సంక్షేమ గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కర్త గేదెల రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 25రోజులుగా సమ్మె చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలని కోరారు. వారి ఉద్యోగాలను డిఎస్సీ నుంచి మినహాయించాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో కళాశాలల్లో 20 ఏళ్లుగా పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు అధ్యాపకులు డిఎస్సీలో ఎంపిక కాకపోతే వారి భవిష్యత్తు అంధకారమవుతుందని చెప్పారు. వీరిలో చాలామంది వయస్సు పైబడిన వారు వున్నారని, అలాంటి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటానికి కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు. విలేకరుల సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య పాల్గొన్నారు.

15న పొట్టి శ్రీరాములు వర్ధంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం కలెక్టరేట్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటన జారీచేశారు. ఈనెల 15న పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి అందరూ విచ్చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

డాక్యుమెంటరీని తిలకిస్తున్న జెసి శోబిక, వివిధశాఖల అధికారులు

స్వర్ణాంధ్ర -2047 విజన్ విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విడుదల చేశారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంను వర్చువల్ విధానంలో ఇతర జిల్లాలకు ప్రసారం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, ఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మధరావు, జిల్లా సాంఘిక, బిసి సంక్షేమ సాధికారిత అధికారులు ఎండి గయాజుద్దీన్, ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇలాకాలో ప్రజాస్వామ్యం ఖూనీ

- దొడ్డిదారిన గెలవాలనుకోవడం దారుణం
- తహశీల్దార్, విఆర్ఒలపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం, వైసిపి, జనసేన

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నియోజకవర్గంలోని సొంత మండలంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సంఘాల ఎన్నికల్లో టిడిపికి తప్ప మిగిలిన వైసిపి, జనసేన, సిపిఎంకు నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. ఒక్కరోజు ముందు ఎన్నికలు ఉన్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఆరు వరకు వేచి ఉన్నప్పటికీ స్థానిక తహశీల్దార్ షేక్ ఇబ్రహీం తమ కార్యాలయానికి రాకపోవడమే కాక రెవెన్యూ ఉద్యోగులను కూడా రాకుండా చేయడం దారుణమని విమర్శించారు. ఉద్యోగులు రాజకీయ నాయకుల ఒత్తిడికి లోనై వ్యవహరించి ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీల హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించడం దురదృష్టకరమని అన్నారు. ఈ అంశంపై కలెక్టర్‌కు ఇతర ఉన్నత అధికారులకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికలను వాయిదా వేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

అధికారంలో ఉండి అంత భయం ఎందుకు? : వైసిపి

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండీ కూడా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి భయపడడం పరోక్షంగా ఓటమని అంగీకరించినట్లేనని వైసిపి మండల నాయకులు మావుడి రంగు నాయుడు అన్నారు. నీటి సంఘం ఎన్నికల్లో పోటీలో నిలబడితే ఒక్క టీసీని కూడా గెలవలేమన్నది టిడిపి నాయకత్వానికి ముందే తెలుసని అందుకే ఈ రకంగా దొడ్డిదారిని ఎంచుకున్నారని విమర్శించారు. శుక్రవారం తమ సానుభూతిపరులకు ఏ విధమైన నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి వెళ్లిపోవడం దారుణం అన్నారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ నెలకొనలేదని, ఈ విధమైన ఒరవడికి దారి తీస్తే రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని టిడిపి నాయకత్వానికి ఆయన హెచ్చరించారు. మండలంలో ఏ ఎన్నికలు జరిగినా వైసిపిదే విజయమని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. పార్టీ ఆదేశాల మేరకు తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఏది ఏమైనా ఈ విధమైన చర్యలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం, వైసిపి నాయకులు గంగునాయుడు, రంగునాయుడు

జనసేనకు ఇవ్వని నో డ్యూలు

నీటి తీరువా చెల్లింపులకు ఆన్లైన్లో పేమెంట్ చేయాలని చూసినప్పటికీ అవి పోవడంతో స్థానిక తహశీల్దార్‌ను ఆశ్రయించినా ప్రయోజనం లేకుండా పోయిందని, కావాలనే దురుద్దేశంతో నో డ్యూలు ఇవ్వకుండా చేశారని జనసేన నాయకులు పెంట తిరుపతిరావు ఆరోపించారు. ఇందుకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఇలాంటి పరిణామాలు గతంలో ఎప్పుడూ చూడలేదని, ఈ సంస్కృతి సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలంలోని ఏడు మీడియం ఇరిగేషన్, నాలుగు మైనర్ ఇరిగేషన్లకు సంబంధించిన ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20 వరకు జరుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతి రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీ శనివారం ఉదయం 10గంటలకు స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ప్రారంభిస్తారని, అలాగే జిల్లా అంతటా నిర్వహిస్తామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని, స్వయం సహాయక మహిళ బృందాలకు ముగ్గుల పోటీలు, ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. "విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం" అన్న అంశంపై నిష్ణాతులతో ఎం.ఆర్.నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో వర్క్ షాపులు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత గురించి వినియోగదారులతో అన్ని విద్యుత్ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. విద్యుత్ పొదుపుపై అవగాహనకు గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జెవివి కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై పాఠశాల విద్యార్థులకు నిర్వహించే పోటీలలో విజేతలకు ఈనెల 20న బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు.

గరుగుబిల్లి: మండల విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈనెల 20 వరకు విద్యుత్తు పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎఇ బడే శ్రీనివాసనాయుడు తెలిపారు. విద్యుత్తు పొదుపు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, అధికంగా విద్యుత్తు వినియోగించడం వల్ల కలిగే అనార్థాలను తెలియజేసేందుకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎఎస్‌పి దిలీప్‌కిరణ్

318 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - సాలూరురూరల్

పాచిపెంట మండలం మాతుమూరు వద్ద పోలీసుల తనిఖీల్లో 318 కేజీల గంజాయి పట్టుబడినట్టు ఎఎస్‌పి ఒ.దిలీప్‌కిరణ్ తెలిపారు. శుక్రవారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పాచిపెంట పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా శుక్రవారం అరకు నుంచి సాలూరు రహదారిలో కారులో సుమారు 318 కేజీల గంజాయిని (సుమారు 16 లక్షలు) ఎస్.కోటకు చెందిన మద్దాల వంశీ, సుబ్బారావు తరలిస్తుండగా, వారిని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిరంతరం పోలీసుల నిఘా పెడుతున్నా గంజాయిని వివిధ పద్ధతుల్లో పట్టుకెళ్తూ పట్టుబడుతూ జైలుకు వెళ్తున్న యువత ఆ మార్గాన్ని విడవకపోవడం బాధాకరమన్నారు. యువత ఇటువంటి పెడధోరణులు వీడి సన్మార్గంలో నడవాలని సూచించారు. విలేకరుల సమావేశంలో రూరల్ సిఐ పి.రామకృష్ణ, పట్టణ సిఐ బి.అప్పలనాయుడు, సాలూరు, పాచిపెంట ఎస్ఐలు నరసింహామూర్తి, కెవి సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ డెప్యుటేషన్ కాపీలు దహనం

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల కాపీలను యుటిఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం నాయకులు, ఉపాధ్యాయులు దహనం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉత్తర్వుల కాపీలను యుటిఎఫ్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల అటు గిరిజన సంక్షేమ విద్యార్థులు, ఇటు గురుకుల పాఠశాల విద్యార్థులు నష్టపోతున్నారని చెప్పారు. మన్యం జిల్లా నుంచి 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న గురుకుల పాఠశాలలకు ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై నియమించడం దుర్మార్గమని చెప్పారు. ఈ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, లేకపోతే 14న యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు, 17న చలో ఐటిడిఎ కార్యక్రమం చేపట్టనున్నట్లు మురళీమోహన్ రావు తెలిపారు.

జిఒ కాపీలను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

జిసిసి గోదాం పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక జిసిసి బ్రాంచ్ కార్యాలయాన్ని మన్యం జిల్లా మేనేజర్ మహేంద్ర కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిసిసి డిఆర్ఎస్, ఎంఎల్ఎస్ గోదాములను పరిశీలించారు. నవంబర్ నెల గ్యాస్, పెట్రోలు అమ్మకాలు ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు. మళ్లీ పూర్తిస్థాయిలో అమ్మకాలు చేయాలని, దీనికి ప్రణాళిక వేసుకోవాలని అన్నారు. డిఆర్ఎస్ అమ్మకాలు పెంచాలని నెల మొత్తం సేల్స్ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎంఎఫ్‌పి సీజన్ వస్తుందని, కావున ముందుగానే పిపిసి ఇన్‌ఛార్జిలు, మేనేజర్, అకౌంట్ స్టాఫ్ గిరిజన గ్రామాల్లో పర్యటించి అవగాహన సదస్సులు ఈనెల 18 నుంచి నిర్వహించాలన్నారు. అటవీ ఉత్పత్తుల ధరలు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎంఎఫ్‌పి ధరల పట్టిక ప్రజలకు అందించాలన్నారు. అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు ఆశాజనకంగా ఉంటాయని, ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిసిసి మేనేజర్ వి.కృష్ణ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

గోడౌన్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న డిఎం మహేంద్రకుమార్

రైతులను మోసగించిన ప్రభుత్వం

కలెక్టరేట్ ఎదుట వైసిపి ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో టిడిపి ప్రభుత్వం అన్నదాతలను నిలువునా మోసగించిందని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర విమర్శించారు. అన్నదాత కు అండగా అనే కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అరుకు ఎంపీ డాక్టర్ తనూజా రాణి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్, మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్పశ్రీవాణి, మాజీ ఎమ్మెల్యేలు కళావతి, జోగారావు ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు లేనిపోని హామీలిచ్చి టిడిపి కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయన్నారు. అధికారం చేపట్టి ఆరునెలలైనా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని చెప్పారు. రైతులకు ఏడాదికి రూ.20వేలు చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని చెప్పి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో 53లక్షల మంది రైతులకు రూ.34,800 కోట్లు రైతు భరోసా కింద పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం రైతులకు ఏడాదికి రూ.10,700 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. మాజీ మంత్రి పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ అమ్మకు వందనం కింద పంపిణీ చేయాల్సిన డబ్బులు చెల్లించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులను, తల్లులను ప్రభుత్వం నమ్మించి మోసగించిందన్నారు. అంతకుముందు పార్టీ జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్తు రాజు ఆధ్వర్యాన ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పెట్రోల్ బంక్ వరకు వైసిపి నాయకులు కార్యకర్తలు ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ గేటు వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేయడానికి ప్రయత్నించగా పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నిరసన వ్యక్తం చేసిన తర్వాత జిల్లా కలెక్టర్‌కు వినతులు అందజేయాల్సి ఉందని, లోపలికి విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటి తర్వాత కలెక్టరేట్ వద్ద జెసి ఎస్ఎస్ శోభికకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడ్కో మాజీ చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, జెడ్పీటీసీలు, ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

నియోజకవర్గ సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా : ఎమ్‌పి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

అరకు పార్లమెంటు సమస్యలతో పాటు పార్వతీపురం నియోజకవర్గ సమస్యలను పార్లమెంట్లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ తనుజారాణి అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన ఆమె కార్యకర్తలతో మాట్లాడుతూ తన విజయానికి మాజీ ఎమ్మెల్యే చేసిన కృషి మర్చిపోలేనని అన్నారు. ఇక్కడి కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటానని, నియోజకవర్గ సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నేడు నీటి సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 14న (శనివారం) మండలంలోని 19 నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వెంగళరాయ, సీతానగరం ఆయికట్టు నీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయన్నారు. అయితే వెంగళరాయసాగర్ ఎన్నిక అంటిపేట ప్రాథమిక పాఠశాల వద్ద, సీతానగరం ఆయకట్టు నీటి సంఘం ఎన్నిక తామరకండి ప్రాథమిక పాఠశాల వద్ద, మిగతా 17 ఆయా గ్రామాల పాఠశాలల వద్ద జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఆయకట్టుదారులంతా సహకరించాలని కోరారు.

అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న గయాజుద్దీన్

బిసిలకు డిఎస్‌సి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బిసిలకు, ఎస్‌సిలకు ఉచిత డిఎస్‌సి కోచింగ్ ప్రారంభమైంది. పార్వతీపురంలోని భాస్కర కళాశాలలో శుక్రవారం జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్ ఈశిక్షణను ప్రారంభించారు. ఉచిత కోచింగ్ రెండు నెలల పాటు కొనసాగుతుంది. ఈ సందర్భంగా గయాజుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో 16500 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోచింగ్ ఇస్తామన్నారు. కోచింగ్‌ను వినియోగించుకొని, కష్టపడి చదివి ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించాలని అన్నారు. అనుభవం గల శిక్షకులు ఉన్నారని, వారి సేవలను వినియోగించుకుని ప్రతి సబ్జెక్ట్‌లో పట్టు సాధించాలని ఆయన సూచించారు. పట్టుదల, అంకితభావం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ మాట్లాడుతూ ఉచిత కోచింగ్ రెండు నెలల పాటు కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం 40 మంది విద్యార్థులు శిక్షణలో చేరారని, ఇంకా 70 మంది బిసి అభ్యర్థులు, 30 మంది ఎస్‌సి అభ్యర్థులకు చోటు కల్పించే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు త్వరగా శిక్షణలో చేరి ప్రయోజనం పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి నగదు బహుమతిని అందజేస్తున్న ఉపాధ్యాయుడు

వ్యాసరచన పోటీల విజేతకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బంక శ్రావణి ఇటీవల జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలో ప్రథమబహుమతి పొందింది. ఈ మేరకు ఆమెకు హైదరాబాద్‌లో నివాసముంటున్న సీతానగరానికి చెందిన రామతోట రమేష్ తన తండ్రి రామతోట సత్యనారాయణ జ్ఞాపకార్థం రూ.2,116వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ ఆర్థికసాయాన్ని ఆ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులు గేదెల నాగరాజు ద్వారా అందజేశారు. దాతకు పాఠశాల హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఇన్చార్జ్ హెచ్‌ఎం ముప్పాల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ శాఖ ఎఇగా కోటేశ్వరరావు

ప్రజాశక్తి - కురుపాం

మండల విద్యుత్‌శాఖ ఎఇగా వై.కోటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్చార్జి ఎఇగా తాను బాధ్యతలు స్వీకరించానని మండలంలో ఎక్కడా ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తూ తన సిబ్బందిని గ్రామాల్లో అందుబాటులో ఉండేలా చూస్తానని అన్నారు. అలాగే బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న సాయికృష్ణచైతన్య

జాబ్‌మేళాలో 15 మంది ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 15 మంది యువతీ, యువకులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా కురుపాం నియోజకవర్గానికి సంబంధించి కురుపాంలో జాబ్ మేళాను నిర్వహించామని, ఈ మినీ జాబ్ మేళాలో బిఎఫ్ఎల్ ఫైనాన్స్, డైకిన్, 2050 హెల్త్‌కేర్ కంపెనీ ప్రతినిధులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఇందులో 33 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, 15 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ఎన్.మనోజ్ కుమార్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - పాలకొండ

రైస్ మిల్లర్ల దోపిడీ అరికట్టాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు స్థానిక సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి, క్వింటాకు అదనంగా ఐదు కేజీల ధాన్యం రైతుల వద్ద తీసుకుంటున్నారని, ఈ దోపిడీని అరికట్టాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

15న జాతాపు జాగృతి వన మహోత్సవం

ప్రజాశక్తి - కురుపాం

జాతాపు జాగృతి వనమహోత్సవం ఈనెల 15న అడ్డాపుశీలలో నిర్వహిస్తున్నామని జాతపు జాగృతి నాయకులు ఊయక తిరుపతి, ఊలక నాగభూషణ, మన్మధరావు అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఆదివాసీలంతా వన మహోత్సానికి తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అందులో భాగంగా ప్రతి ఆదివాసి బిడ్డకు వనమహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేస్తామన్నారు. ఇంకా ఎవరికైనా ఆహ్వాన పత్రిక అందకపోయిన తప్పకుండా వచ్చి వనమహోత్సవంలో పాల్గొవాలని కోరారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాతాపు జాగృతి నాయకులు

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతో ఉండాలని ఎఎస్ఐ లంక శ్రీను వాసరావు అన్నారు. సంకల్పంలో భాగంగా మండలంలోని గుచ్చుమి అప్పయ్య పేట జంక్షన్లో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ మీకు తెలియని వ్యక్తుల నుంచి లింకులు పంపిస్తే ఓపెన్ చేయొద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైం, ఆన్లైన్ మోసాలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ జయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంబరలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరలో శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - సీతానగరం

రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎడి పి.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని పెదభోగిలి పరిధిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ సదస్సులో తమ భూ సమస్యలను తెలియజేసుకోవచ్చన్నారు. ఈ సదస్సులో వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు కృషి జరుగుతుందన్నారు. భూ సర్వే జరిగిన ఆన్లైన్లో ఉందని, ఒకరి నుంచి వేరొకరికి హక్కులు వివిధ రకాల ఈ సదస్సులో తెలియజేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, సర్వేయర్, విఆర్ఒ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీతంపేట : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులని తహశీల్దార్ పి.అప్పలరాజు అన్నారు. మండలంలోని చిన్న పల్లంకి, పెద్ద పల్లంకి, గుజ్జిమీనకోట తదితర గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అధికంగా మోటీషన్లు వచ్చాయని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిటి మధుసూదన్ రావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని నాగూరు ఎంపిటిసి సభ్యులు ద్వారపు రెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు) కోరారు. మండలంలోని నాగూరులో ఉపతహశీల్దార్ బూరాడ సుందరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సర్పంచ్ ప్రతినిధి కేతిరెడ్డి అచ్యుతరావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై వినతులు అందజేయాలని కోరారు. అనంతరం డిటి రైతుల నుంచి వినతులు స్వీకరించి ఫిర్యాదులను ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అక్కేన వెంకటనాయుడు, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, దేవాదాయ శాఖ నుంచి పెడారపు పోలిరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : సదస్సులో మాట్లాడుతున్న ఎడి లక్ష్మణరావు

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని హైరిస్క్ గర్భిణులపై ఎఎన్ఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక ఎన్‌జిఒ హోంలో హైరిస్క్ గర్భిణుల నిర్వహణ, నియమాలపై ఎఎన్ఎంలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణుల పట్ల శ్రద్ధ వహిస్తున్నప్పటికీ, హైరిస్క్ గర్భిణుల పట్ల మరింత ప్రత్యేక శ్రద్ధ అవసరమని అన్నారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణుల గత ప్రమాద చరిత్ర, ఎనీమియా, బీపీ, షుగరు, ఫిట్స్, రక్తస్రావం మొదలగు వాటి గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని అన్నారు. అటువంటి వారికి అవసరమైన చికిత్సను అందించి సుఖ ప్రసవాలు జరిగేలా చూడాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో మాత్రమే గర్భిణీలను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో శిక్షణ అధికారి డాక్టర్ ఎ.కృష్ణమూర్తి, సమన్వయకర్త కె.ప్రశాంత్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.పద్మావతి, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి, డెమో వి.సన్యాసిరావు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ విజయపార్వతి

మీడియాపై దాడులు సహేతుకం కాదు

ప్రజాశక్తి - పాలకొండ

ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియాపై దాడులు సహితం కాదని పాలకొండ ప్రెస్ క్లబ్ ఖండించింది. కడపలో సాక్షి మీడియా ప్రతినిధులు శ్రీనివాసరావు, రాము, రాజారెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా భద్రతతో పాటు కట్టుదిట్టమైన చట్టాలను అమలు చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సన్యాసిరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు జొన్నలగడ్డ కామేశ్వరరావు, కార్యదర్శి మండపాక శ్రీధర్‌బాబు, కోశాధికారి మండల గణేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సుబ్రహ్మణ్యం, సలహాదారు బి.వెంకటరమణ, సహాయ కోశాధికారి ఈశ్వరరావు, మీడియా ప్రతినిధులు కనపల అన్నాజీరావు, ఎం.కల్యాణ్‌కుమార్, ఎస్.గాంధీ, అల్లన మేఘ శ్యామ్, సుబ్బు, నానాజీ, రావాడ కోటేశ్వరరావు, వెలమల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఒ ప్లాంట్‌ను అందజేసిన రవికుమార్, ఉపాధ్యాయులు

పాఠశాలకు ఆర్‌ఒ ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నీలానగరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సుడా చైర్మన్ కోరికన రవికుమార్ రూ.5లక్షల విలువైన ఆర్వో ప్లాంట్‌ను బహుకరించినట్లు ప్రధానోపాధ్యాయులు జి.రవిప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మండలంలోని పనసనందివాడకు చెందిన సుడా చైర్మన్ కోరికన రవికుమార్ అప్పట్లో ఇదే పాఠశాలలో చదివినప్పుడు తాగేందుకు మంచినీటి సౌకర్యం లేకపోవడంతో పాఠశాలకు సమీపంలో ఉన్న చెరువులో నీరు తాగి దాహార్తిని తీర్చుకున్నారని, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ఈ సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో విద్యాభ్యాసం కొనసాగించే పాఠశాలను అభివృద్ధి చేయాలని చైర్మన్ అన్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు అభినందనలు తెలిపారు.

పిహెచ్‌సిల్లో డిపిఒ తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి, ధోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు నమోదు పరిశీలించి అందరూ పిహెచ్‌సి విధుల్లో ఉన్నారా అని ఆరా తీశారు. పిహెచ్‌సిలో వైద్య సేవలందుతున్న తీరును ఆయా విభాగాల వారీగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ల్యాబ్‌లో వైద్య పరికరాల పనితీరు గమనించారు. రక్త, మూత్ర పరీక్షల నివేదికలు సకాలంలో తెలియజేస్తున్నారా అని పరీక్షించిన అనంతరం నివేదించిన తారీఖులను పరిశీలించారు. పరికరాల్లో సాంకేతిక లోపాలు తలెత్తకుండా సక్రమంగా ఉపయోగించి జాగ్రత్త పర్చాలన్నారు. సాధారణ ప్రసవాలు నిర్వహించడానికి అవసరమైన వైద్య పరికరాలు, ఇంజక్షన్లు, మౌలిక సదుపాయాల లభ్యత పరిశీలించారు. కాన్పుల రికార్డులు పరిశీలించి పిహెచ్‌సిల్లో ప్రసవాల సంఖ్య మెరుగుపడాలని ఆదేశించారు. అందుకు కార్యాచరణ ఏ విధంగా చేపడతారని సుపర్వైజర్లను ఆరా తీశారు. మందుల నిల్వలు, వినియోగం రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా, వాటి కాలపరిమితి తనిఖీ చేశారు. కుక్క, పాముకాటులకు మందుల లభ్యతను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణ పరిశీలించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. సాయంత్రం, రాత్రి వేళల్లో షిఫ్ట్ డ్యూటీ సిబ్బంది పిహెచ్‌సి అందుబాటులో ఉంటున్నారా అని, పర్యవేక్షించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆరోగ్య పర్యవేక్షకులు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో సందర్శించి ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలని, టూర్ డైరీ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సందర్శన (మూమెంట్)రిజిస్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు జాప్యం లేకుండా సకాలంలో వైద్యం అందించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సిహెచ్.చాందిని, వి.శివశంకర్, రత్నం ఆరోగ్య కార్యాలయ డెమో యోగీశ్వరరెడ్డి,సూపర్వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జగన్మోహనరావు

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై రెండో బ్యాచ్ శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఆర్థిక వనరులు కీలకమన్నారు. ఈ ఆర్థిక వనరుల సేకరణకు పంచాయతీలోనే నిధులు సేకరించాలన్నారు. అలాగే వివిధ అభివృద్ధి పనులను చేసేటప్పుడు శాఖల సమన్వయంతోనే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఒ ఎస్.అవినాష్, ఎపిఎం ఆర్.శ్రీరాములునాయుడు, తహశీల్దార్ ఉమామహేశ్వరరావుతో పాటు వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : గత నాలుగు రోజులుగా పంచాయితీల అభివృద్ధిపై లక్ష్యాలు నిర్దేశించుకోవడానికి కల్పించిన శిక్షణను సచివాలయ సిబ్బందితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కె.రూపేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌డిజి శిక్షణ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సహాయకులతో పాటు కార్యదర్శులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న సీతానగరం ఎంపిడిఒ త్రివిక్రమరావు

ఆదమరిస్తే ఆపదే ...

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో లంబూరుకు వెళ్లే రోడ్డుకు పెద్ద గుంత పడింది. రోడ్డు మలుపులో గుంత ఉండడం, రాత్రి సమయంలో ఇక్కడ వీధి దీపాలు లేకపోవడంతో ఇక్కడ ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ రోడ్డులో ఈ గుంత దగ్గర ఆదమరిస్తే ప్రమాదం జరగడం ఖాయం. అధికారులు ఈ సమస్యను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపక్కన ప్రమాదకరంగా ఉన్న గొయ్యి